కథానిక

గాలివాన

శ్రీ పి. గణపతిశాస్త్రి

ఇందుమౌళి జగదీశ్వరాలయమండపంలో అరచేయి తలగడగా అనుకొని అలాగే శయనించి ఉన్నాడు. అర్ధరాత్రివేళ ఉదయించిన చంద్రుని కిరణాలలో ఆలయసహస్రస్తంభమంటపం మన కలు కేస్తూ తేలుతున్నట్లు ఉన్నది. ముమ్మరమైన జ్యేష్ఠగ్రీష్మతాపం వల్ల అర్ధరాత్రిఅయినా ఇంకా గాలి తిరగలేదు. దూరంగా ప్రవహిస్తున్న సెలయేటిలో అప్పుడప్పుడు పక్షుల రెక్కల కదలికలు వినవస్తున్నాయి. చుట్టూ ఉన్న నిర్జనారణ్యంలో ఎండుటాకులు గలగలలాడిన చప్పుడు కూడా అతనికి నిద్రాభంగం కలిగిస్తున్నది. కాషాయధారులైన ఆచార్యుని శిష్యులు సమీపంలో గాఢంగా నిద్రిస్తున్నారు. వెన్నెల మెల్లిమెల్లిగా సహస్రస్తంభమంటపం మీదికి ఎక్కివస్తున్నది. ఎంత ప్రయత్నించినా ఇందుమౌళికి ఆ వేళ కంటికి కునుకు పట్టడంలేదు. అతనికి గతజీవితమంతా లాస్యం చేస్తూ కన్నుల ఎదుట కదలిపోతున్నది. ఆచార్యుని దర్శించిన మొదటినాటి వృత్తాంతమంతా కూడా కన్నులకు కట్టినట్లున్నది.



"ఎంత ప్రయత్నించినా ఇందుమౌళికి కంటికి కునుకు పట్టడంలేదు. గతజీవితమంతా లాస్యంచేస్తూ కన్నుల యెదుట కదలిపోతున్నది."

మొట్టమొదట ఆచార్యుని దర్శించిన ఉత్తరక్షణంలో శోకంతో అతని హృదయం ఉరకలు వేసుకుంటూ పైకి ఉబికింది. ఆచార్యుడు అతని వైపు ప్రశాంతంగా నిశ్చలంగా తిలకించాడు. ఇందుమౌళిహృదయం కొంతసేపటివరకూ బాష్పరుద్ధమైనది. అతనిని చూచిన ఆచార్యదేవుల నేత్రాలు కరుణార్ద్రములైనాయి. అతడు బెంగటిల్లిపోయిన శిశువులా వెక్కివెక్కి ఏడ్చాడు. ఆచార్యదేవుడు చల్లని మాటలు చెప్పి, అతనికి పత్నీవియోగదుఃఖము ఉపశమింపచేయడానికి వేయివిధాలుగా ప్రయత్నించాడు.

ఆపిమ్మట ఇందుమౌళి ఆ ఆశ్రమంలో రెండుమూడురోజులున్నాడు. తరవాత మళ్లీ ఆచార్యుని దర్శించి, తానింక విదర్భదేశానికి తిరిగి పోదలుచుకోలేదనీ, ఆశ్రమంలోనే ఉండి తపశ్చర్య చెయ్యదలచెనని నిశ్చయించుకున్నాననీ విన్నవించాడు. మొదట ఆచార్యుడు దానికి అంగీకరించలేదు. తిరిగి విదర్భదేశానికి వెళ్లి సాంసారిక జీవనం గడపడం మంచిదని ఆదేశించాడు. ఇందుమౌళి కొంతసేపుండి, మళ్లీ దృఢంగా ఆచార్యునికి తన మనోభిప్రాయం వెల్లడించాడు. "నేనిక్కడనే ఉండి, ఇకనుండి యావజ్జీవమూ తత్త్వాన్వేషణ చెయ్యదలుచుకొన్నాను. ఇది నా కృతనిశ్చయము!"

ఆచార్యుడు క్షణకాలం మౌనముద్ర వహించి, ప్రశాంతంగా, "ఈ నిర్జనారణ్యంలో నీ అన్వేషణకు ఫలితం కలగదు" అన్నాడు.

ఇందుమౌళికి ఆచార్యుని సమాధానం ఇలాగ ఉండగలదని తట్టలేదు. కొంతసేపూరుకొని, "నిర్జనారణ్యంలో కాకపోతే, జనాకీర్ణనగరంలోనా అన్వేషణ!" అన్నాడు.

"ఔను! అక్కడే!"

"అక్కడ మనశ్శాంతి కలుగగలదా?"

"అక్కడ రాని మనశ్శాంతి ఇక్కడ కుదరదు!"

"ఆ వ్యామోహాలలో—ఆ తీవ్రదుఃఖాలలో—ఆ అసూయాలలోనా?"

"అవును. ఆ అఘాతాలలోనే, ఆ దుఃఖాలలోనే నీ జిజ్ఞాసకు ఫలితం లభించగలదు!"

కొంతసేపుండి మళ్లీ ఇందుమాళి ఆచార్యదేవునికి తన అభ్యర్థన సెరవేర్చవలసిందని విన్నవించాడు. మళ్లీ ఆచార్యుని మౌనముద్ర. ఇందుమాళి తిరిగి ప్రాధేయపడ్డాడు.

"నీ తరుణవయస్సులో ఈ తపశ్చర్య సాధ్యం కాదు."

"తమ అనుగ్రహానికి అసాధ్యం ఏమీ ఉండదు"

"నీ చిత్తవృత్తి బాల్యంనించీ రాజభోగాలకు అలవాటుపడి ఉన్నది"

"......అందుచేతనే వాటితో విసిగి, తమ సన్నిధికి వచ్చాను."

ఆచార్యుడు వ్యగ్రంగా అతనివైపు చూచాడు. ఇందుమాళి "తమ రనుగ్రహించకపోయినా నే నిక్కడే అకులూ, అలములూ తింటూ ఉండిపోతాను." అన్నాడు.

మళ్లీ చాలాసేపటివరకూ ఆచార్యుడు మాట్లాడలేదు. చివరికి ఆయన నిశితంగా అతనివైపు చూచి ఇలాగ అన్నాడు:

"నిన్నిక్కడ ఉండవద్దని అనడానికి నాకు అధికారం లేదు. నీ విక్కడనే ఉండిపోవచ్చును. దానికి నా అభ్యంతరం కించిత్తూ లేదు. అయితే ఒక్కమాట! ఎప్పటికైనా ఆ నగర మధ్యంలో, ఆ జీవనకోలాహలంలోనే నీ తత్త్వాన్వేషణ ఫలిస్తుంది. ఇది ముమ్మాటికీ నిశ్చయము."

ఇందుమాళి దూరంగా అస్పష్టంగా కనిపించే వైశాలీసౌధశిఖరాలవైపు తిలకించాడు. అవి అతనికి తెల్లని అగ్నిజ్వాలాజిహ్వలలాగ భాసించాయి. మళ్లీ అతడు ఆచార్యునివైపు తిరిగి "ఆ అగ్నిజ్వాలలోనా?" అని ప్రశ్నించాడు.

"ఆ, అవును! ఆ మహాగ్నిజ్వాలలోనే!"

అపిమ్మట ఒకటిరెండు దినాలకు ఇందుమాళి ఆశ్రమవాసిగా అక్కడనే ఉండిపోయాడు. అప్పుడే ఇది జరిగి రెండేళ్ళు కావస్తూంది. ఆ ఆచార్యుడు అన్న మాటలు అతని హృదయంలో జేగంటలలా ప్రతిధ్వనిస్తున్నాయి. అయితే ఈ రెండేళ్లలోనూ అతని జీవితం ఎంతో ప్రశాంతంగా గడిచిపోయింది. ఇది ఆచార్యుని అనుగ్రహబలమేమో ఎవరు చెప్పగలరు?

అప్పుడే రాత్రి నాలుగోయామం ప్రవేశించినట్లే ఉన్నది. నిండువెన్నెలలో జగదీశ్వరాలయమండపశిల్పాలు కన్నులు మిరుమిట్లు గొలుపుతున్నాయి. మెల్లిగా ఒక పిల్లగాలి వీచింది. అతని నేత్రాలు అప్రయత్నంగా ఆశిల్పాలవైపు ప్రసరించాయి. అలిసిపోతున్న అతని నేత్రాలు మూసుకుపోతున్నట్లున్నాయి. కాని నిద్రమాత్రం పట్టడంలేదు. ముందుగా అతని నేత్రాలు నరనారాయణశిల్పాలవైపు ప్రసరించాయి. నరనారాయణులు సృజించిన ఊర్వశీరూపానికి సిగ్గుపడి దేవకన్యకలు తలలు వంచుకొన్నారు! ఆ నరనారాయణుల విగ్రహాలలో ఎంతటి ప్రశాంతత తాండవిస్తున్నది! పిమ్మట అతనికి విశ్వామిత్రతపోభంగశిల్పం కనబడింది. విశ్వామిత్రుడు మేనకాలాస్యముగ్ధుడై తదేకధ్యానంగా ఆమెవైపు తిలకిస్తున్నాడు! అది మేనకావిగ్రహమేనా? అది ఎంత మనోహరశిల్పము! తాను అటువంటి మూర్తిని ఎప్పుడో చూచినట్లే ఉన్నది. ఆమె ఎవరు? అతనికి తటాలున ఆమెసౌందర్యము, పేరు స్మృతిపథంలో మెరిశాయి. అవును! ఆమె పేరు తారుణి! విదర్భదేశం అంతా ఆమెలాస్యానికి తన్మయమైపోయింది. ప్రత్యేకంగా తా నామెలాస్యానికి మెచ్చి స్వర్ణకింకిణులుకూడా బహూకరించాడు. ఆమెలాస్యగోష్ఠి అంటే ఆరోజులలో తాను ఎంతో ఆప్యాయత కనబరిచేవాడు! అది తన వివాహానికి పూర్వం జరిగినకథ! ఆరోజులు ఎంత మనోజ్ఞంగా గడిచిపోయాయి! ఆమె ఎంత సౌందర్యవతి! — ఈ చివరిభావన అతని స్మృతికి కశాఘాతంలా తగిలింది! తటాలున అతడు పశ్చాత్తప్తుడై ఆ ఆలోచనలన్నిటినీ తన భావనాపథంలోనించి తరిమివేశాడు. ముకుళితనయనాలతో ఆచార్యుని నామధేయము ఉచ్చరించి, ఆయన మూర్తిని మనస్సులో ప్రతిష్ఠించుకొన్నాడు. ఆమూర్తికేసి నిశ్చలంగా తిలకించాడు. అది ఆచార్యుని మూర్తి కాదు! తారుణీమూర్తిలా కనిపించింది. మళ్లీ పరితప్తహృదయంతో ఆచార్యమూర్తిని ధ్యానించుకొన్నాడు. అతనికి దూరదూరాన సన్నని సెలయేటిగానంలో తన ధ్యానప్రవాహం కలిసిపోతున్నట్లనిపించింది. చివరికి తెల్లతెల్లవారేవేళ అలసిపోయిన అతని నేత్రాలకు ఏదో కలతనిద్ర పట్టింది.

౨

ఆచార్యుని ఆశ్రమం వైశాలీనగరానికి సుమా రొక క్రోశం దూరంలో ఉన్నది. అరణ్యమధ్యభాగంలో ఉన్న జగదీశ్వరాలయపు సహస్రస్తంభమంటపంలోనే ఒక భాగంలో ఆయన నివాసము. ఆచార్యుని శిష్యులు వైశాలీనగరానికి భిక్షకుపోయి మిట్టమధ్యాహ్నవేళకు తిరిగివస్తూంటారు. మరీ వృద్ధులైనవారు కొంతమంది అరణ్యంలో కందమూలఫలాలతోనే కాలక్షేపం చేస్తూంటారు. వైశాలీనగరానికీ జగదీశ్వరాలయానికీ మధ్యన అడ్డంగా సెలయే రొకటి ప్రవహిస్తున్నది. వేసవికావడంచేత సెలయేటి నీరు యజ్ఞోపవీతంలా సన్నగా స్వచ్ఛంగా మెరుస్తున్నది. కొన్నికొన్నిచోట్ల సెలయేరు ఇంకిపోయినట్లే కనిపిస్తున్నది. అల్లాంటి పట్టులలో తెల్లటి కొంగలు కదలిపోయే మీనాలకోసం నిరీక్షిస్తూ అవి కనబడినప్పుడల్లా ఎగిరి వాటిని అందుకుంటున్నవి. ఇందుమాళి నేడు స్నానానికి సెలయేటికి వచ్చేసరికే కొంత ఆలస్యం అయింది. సెలయేటిఒడ్డున సైకతంలో నిశ్చలధ్యాననిష్ఠలో మునిగిన అతనికి అపరాహ్ణం సమీపించేవరకు కాలాతిక్రమణవిషయమే తెలియలేదు. ధ్యానం ముగించుకొని అతడు భిక్షార్థం వైశాలీనగరంవైపు త్వరత్వరగా నడక సాగించాడు. వేడిఎక్కిన సెలయేటి ఇసుకలో అతని పాదాలు బొబ్బలెక్కుతున్నాయి. కొంగలు తమ వేట ముగించి

సమీపంగా ఉన్న చెట్లకొమ్మల్లో తలదాచుకున్నాయి. మృగశిర ప్రవేశించి అప్పుడే పదిరోజులు కావస్తున్నది. అయినా పెద్ద వానలు కురవకపోవడంచేత గ్రీష్మతాప మింకా అలాగే ఉన్నది. ఇందుమాళి తొందరగా వైశాలీనగరం ప్రవేశించాడు. ఆకాశంవైపు పరికిస్తే అప్పుడే అపరాహ్ణం ప్రవేశించినట్లే కనిపించింది. ఒక మూల నల్లని మేఘం మత్తగజంలా పైకి ఉరకలు వేసుకుంటూ వస్తున్నది. అయినా వర్షం కురుస్తుందని అతనికి నమ్మకం కలగలేదు. నాలుగైదు గృహాలలో భిక్షం స్వీకరించేసరికి ఆ మేఘం ఆకాశ మధ్యానికి వచ్చింది దానితోపాటు గాలిదుమారంకూడా లేచింది!

ఇందుమాళి ఇక లాభంలేదని ఆశ్రమోన్ముఖుడైనాడు. కొంచెం చిన్నచిన్న చినుకులు ప్రారంభించాయి. క్రమంగా అవి బట్టతడుపుచినుకు లైనాయి. కొంచెంసేపుండి వాన వెలిసినతరవాత పోవచ్చునని అతనికి ఆలోచన తట్టింది. తన బాటకు ఒక వైపున ఒక మనోహరసౌధము, మరిఒక వైపున ఒక జీర్ణదేవాయతనము ఉన్నాయి. సౌధమే తలదాచుకోడానికి ఎక్కువ అనువుగా ఉన్నది. అయినా దానిలోకి ప్రవేశించడం ఇష్టంలేక జీర్ణదేవాయతనమంటపంలోకే వెళ్లి తలదాచుకొన్నాడు.

వర్షం ధారాపాతంగా కురవడం మొదలుపెట్టింది. కొంతసేపటికి మళ్లీ ఆ ఉద్ధృతం తగ్గింది. ఇందుమాళి ఉల్లాసంగా ఆకాశం వైపుచూచాడు. ఎదురుగా ఉన్న సౌధంమీదనుండి అగరుధూపమాలికలు మెలికలు తిరిగి మందమందంగా ఖండఖండాలుగా వర్షంలో ఆకాశంవైపు ప్రయాణిస్తున్నాయి. ఇక వాన వెలిసి పోవచ్చునని అతడు దేవాలయద్వారందగ్గరకు వచ్చాడు. ఇంతలో హఠాత్తుగా పెద్దజడి! ఈజడి తగ్గిన తరువాత ఆశ్రమానికి తరలిపోవచ్చునని అతని ఆశ. మళ్లీ వర్షం క్రమంగా ఎక్కువైపోయింది. దానితో పాటు రంయిమని మోతపెడుతూ ప్రచండమైన గాలికూడా రేగింది. అంతకంతకు గాలి, వాన ఒకదానితో ఒకటి స్పర్థించి గాలివానగా మారిపోయాయి! చెట్లమీద తలదాచుకున్న కాకులు గాలితాకిడి భరించలేక చెట్లమీదనించి జారి క్రింద పడిపోతున్నాయి. అతడు ఆశ ఏమైనా ఉన్నదేమోనని ఆకాశంవైపు చూచాడు. సాయంకాలం కావస్తూంది. ఇరుగుపొరుగు ఇళ్లల్లో బయలుదేరిన పొగ గాలివానలో నలువైపులా పరుగెత్తుకొనిపోతున్నది.

ఇక ఆగడం మంచిది కాదని ఇందుమాళి మళ్లీ వీథిలోకి వచ్చాడు. వీథి అంతా మోకాటిలోతున నీరు ప్రవహిస్తున్నది. అయినా నాలుగైదు అడుగులు వేశాడు. వీథులే ఇంత జలమయంగా ఉంటే క్షణంలో పొంగిపోయే పిలవేరు ఎలాగ ఉన్నదో! అయినా ఆసంగతి తరవాత చూడవచ్చునని మళ్లీ నాలుగడుగులు వేశాడు. వాననీరు నడుముదాకా వచ్చింది. అంతకంతకు వాననీటి ప్రవాహం పెరిగిపోతున్నది. ఇక ఈ గాలివానలో—ఈ ప్రవాహంలో ప్రయాణం లాభంలేదు. వాన బాగా వెలిసేవరకూ జీర్ణదేవాయతనంలో తల దాచుకోవడం తప్పనిసరి. ఇందుమాళి అతి కష్టంమీద వెనకకు వచ్చి దేవాలయంలో తలదాచుకున్నాడు. వీథిలో వాననీరు దేవాలయావరణంలోకి వచ్చి చెరువుగామారి పోయింది.

బాగా చీకటిపడింది. ఆ జీర్ణదేవాయతనంలో పూజాపురస్కారాలు లేవు. అతని చైతన్యం అంతా గాలివానహోరుతో నిండిపోయింది. ఉరుములు భయంకరంగా వినవస్తున్నాయి. తటాలున మెరిసిన మెరుపులో మెరిసిన జగత్తు క్షణంలో అంధకారంలో విలీనమైపోతున్నది. ఒక్కొక్కసారి భయంకరంగా ఆకాశం గర్జించేసరికి దేవాలయమంటపం ఊగిసలాడిపోతున్నది! ఆ భయంకరఝంఝూవాతంలో ఆ జీర్ణదేవాలయంలో ఉండడంకూడా క్షేమం కాదని అతనికి తోచింది. కాని చేసేది ఏమున్నది! కన్నూ కన్నూ కనబడడం లేదు. అప్పుడే ఒక ఝాముురాత్రి గడిచి ఉండవచ్చును. అప్పుడప్పుడు అస్పష్టంగా వినవచ్చే ధ్వజస్తంభఘంటికల మోతలలో నీరసమైన అతని శరీరానికి నిద్ర ఆవేశిస్తున్నది.

ప్రళయగర్జనలా ఒక పిడుగు పడిన మోత వినిపించింది. ఆ పిడుగు చాలా సమీపంలోనే పడి ఉంటుంది. క్షణంలో దేవాలయంగోడ కూలి అతనిమీద పడింది. ఒక్క అంగలో అత డాఆఘాతం నించి తప్పుకొన్నాడు. శిరస్సుపై పెద్ద ఆఘాతం తగిలినట్లయింది. అప్రయత్నంగా అతడు ఆచార్యనామం స్మరించుకొన్నాడు. దగ్గరగా జనకోలాహలము, ఆక్రందనధ్వనులు వినిపించాయి. మళ్లీ అతడు ఆచార్యనామం ఉచ్చరించాడు. అంతే! ఆపైన ఏమి జరిగిందో అతనికి స్పృహ లేదు. ఆ పిడుగుపాటుతాకిడికి ఆ జీర్ణ దేవాలయంలో ఒక భాగం కూలిపోయింది. ప్రకృతిశక్తులు భయంకరగా తాండవించాయి. గాలిహోరు ఆ జీర్ణదేవాయతనగర్భ గృహంలో మారుమోగింది.

3

ఇందుమాళికి కొంచెం తెలివి వచ్చింది. అంతరాంతరాల్లో అతని కింకా ఝంఝూమారుతంగర్జనలు, ఉరుములు వినిపిస్తూనే ఉన్నాయి. వీనుల్లో వర్షధ్వని, గాలిహోరు రొద చేస్తూనేఉన్నాయి. కాని పరిసరం చూచి మొట్టమొదట అత డది సత్యమని విశ్వసించలేకపోయాడు. తా నొక సుఖతల్పంపై శయనించి ఉన్నాడు. ఒక పరిచారకుడు, పరిచారిక అతనివైపు ఆత్రంగా తిలకిస్తున్నారు. తాను శయనించిన గృహ మొక ధనిక ప్రాసాదంలా ఉన్నది. ఒక మూల బంగారు నర్తకీశిల్పమూర్తి హస్తంలోనుండి సురభిళమైన అగరుధూపమాలికలు లేచి పరిసరం అంతా ఆవరించుకొంటున్నాయి. రంగురంగుల కాచపాత్రికలలో చిత్రవిచిత్రమైన దీపకళికలు వెలుగుతూ కనులకు మిరుమిట్లు గొల్పుతున్నాయి. దగ్గరగా వివిధములైన భక్ష్యాలు, పానీయాలు అమర్చబడి ఉన్నాయి. ధగధగలాడే ఆపరిసరం చూస్తే అతనికి దిగ్భ్రమ

కలిగింది. ఒక్కసారి కళ్లు మూసుకుని మనస్సులో ఏదో జపించుకున్నాడు. ఒక అరగడియ ధ్యానం ముగించుకొని అతడు మళ్లీ కన్నులు తెరిచాడు. ఎదురుగా మనోహర నారీమూర్తి నిలబడి ఉన్నది. ఆమెను చూడగానే జగదీశ్వరాలయంలో మేనకా లాస్య శిల్పము తటాలున స్మృతి పథానికి తట్టింది. ఏమి విచిత్రము! ఆ శిల్పమే సజీవమై ఇక్కడికి వచ్చిందా? ఈమె ఎవరు? పరిచారికా పరిచారకులవలె కనిపించినవా రిద్దరు ఎవరు? వా రెక్కడికి వెళ్లిపోయారు? ఈమె ఎవ్వరు? నేను కలగంటున్నానా? ఇలాంటి అభిప్రాయాలన్నీ మెరుపుల్లా అతని భావనాకాశంలో పరిగెత్తాయి. చివరికి అతడు క్షీణ స్వరంతో ఇలాగ అన్నాడు:

"నే నెక్కడ ఉన్నాను? మీ రెవరు?"

ఆ స్త్రీ మెల్లిదిగా సందేహిస్తూ సమాధానం చెప్పింది:

"వైశాలీనగరంలో"

"ఈ ఇల్లెవరిది?"

"మాదే!"

"మాదే! అంటే—? మీ రెవరు?"

"నే నెవరో గుర్తించలేరా?"

ఈమాట లవేసరికి అతనిలో వెయ్యి స్మృతు లొకదాని వెంబడి మరొకటి అవిచ్ఛిన్న వేగంలో పరుగెత్తుకుపోయాయి. ఇంతలో భయంకరమైన మేఘగర్జన వినబడింది. తరువాత కుంభపోతగా వర్షిస్తున్న వర్షపు ధ్వని, రొదగాలి మోత. ఆధ్వనికి అతని ఆలోచనలు చెదిరిపోయాయి. మెరుపు ఆమెముఖం మీద తటాలున మెరిసి మాయమైపోయింది.

"ఎవరు?—ఎవరు? వారుణీ..."

"అవును, నేను వారుణినే."

"ఈభవన మెవరిది?"

"మాదే!"

"ఇక్కడి కెప్పుడు వచ్చావు?"

"సంవత్సరం పూర్వము."

"ఇక్కడికి నన్నెవరు తీసుకువచ్చారు?"

"మా పరిచారకులు. మీకు తలపై గాయం తగిలి బొప్పి కట్టింది. మీరు దేవాలయమంటపంలో స్పృహతప్పి—"

ఈమాటలు విని ఇందుమౌళి తటాలున శయ్యమీదనించి లేచి "నే నిక్కడ ఉండడానికి వీల్లేదు! ఆశ్రమానికి తిరిగి వెళ్లిపోవాలి!" అన్నాడు. ఆమె తటాలున అతని దగ్గరకు వచ్చి "ఇంకా గాలి వాన చాలా భయంకరంగా ఉన్నది. ఈరాత్రి ఇక్కడ విశ్రమించి వెళ్లవచ్చును. ఇప్పుడు మీరు చాలా నీరసించి ఉన్నారు! కదిలితే తలకట్టు విడిపోతుంది! లేవకండి!" అన్నది. ఒక్కసారి శిరస్సు మీద తగిలిన ఆఘాతంనుంచి హృదయంవరకు అతనికి బల్లెం గుచ్చుకొన్నట్లయింది. అతడు నిలబడలేక మళ్లీ శయ్యమీద కూలబడిపోయాడు. ఆ కదలికలో అతని తలకు కట్టిన కట్టు విడిపోయి కొంచెం రక్తం ప్రవహించడం మొదలు పెట్టింది. తటాలున ఆమె అతని శయ్యపై కూర్చుని కట్టుకట్టడం మొదలుపెట్టింది. దానితో అతని శిరోవేదన కొంత శాంతించినట్లయింది. అతడామె వైపు ఒక నిమిషం నిశ్చలంగా చూసి "నీవు వైశాలీనగరానికి ఎందుకు వచ్చావు వారుణీ!" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. ఆమె వేడికన్నీటిబిందువొకటి అతని వక్షస్థలంపై రాలింది. "ఇదేమి వారుణీ! అలాగ విచారిస్తున్నావు." అన్నాడు. అంతే! ఆప్రశ్నతో ఆమె ఒక్కసారి అతని వక్షస్థలంపై పడి వెక్కి వెక్కి ఏడ్చింది. భీషణంగా ఫెటఫెటార్భటులతో ఆకాశం గర్జిస్తునే ఉన్నది. గాలివాన గవాక్షాలగుండా వారి ముఖాలపై వర్ష శీకరాలు విసురుతున్నది. భయంకరమైన ఆ బాహ్యప్రకృతి వారి అంతరాంతరాలలో మైకంలా, మద్యంలా, మూర్ఛలా అలముకొని, వారిని పండుటాకులవలె నృత్యం చేయించింది.

అతని కొక్కసారిగా పూర్వవృత్తాంతం అంతా కన్నులకు కట్టింది. మొదట ఆమెనొక నృత్యోత్సవంలో దర్శించాడు. అప్పుడు స్వయంగా ఆమె నైపుణికి ఒక ముత్యాలహారం బహూకరించాడు. ఆ హారం ఆమె ఎంత ఒయ్యారంగా స్వీకరించింది! నాటి నుంచీ ఇంచుమించుగా వివాహంవరకు ఆమెమూర్తి తనలో నిత్యమూ కదులుతూనే ఉండేది. ఆమె తనదగ్గరనుంచి ఎరువుతీసుకొన్న తాళపత్రగ్రంథాలతో అప్పుడప్పుడు మదనలేఖలు పంపిస్తూ ఉండేది. ఆమెలేఖలు ఎంత ఆర్ద్రంగా, ఎంత దీనంగా ఉండేవి! కాని ఏమీ లేకపోయినా అనవసరంగా లోకాపవాద వలువైపులా అల్లుకుపోయింది. క్రమంగా పెద్దల మాటలకు జడిసి అతడు ఆమెస్నేహత్వాలకు కూడా వెళ్లడం మానివేశాడు! చివరికి తన వివాహంనాడు కూడా ఆమె దీనాతిదీనమైన లేఖ పంపించింది. ఆపిమ్మట రాజకార్యాంతరాలవల్ల అతడు నగరాంతరానికి వెళ్ళిపోయాడు. తరువాత ఆమెవృత్తాంతం తెలియలేదు! పిమ్మట తనకు దారుణమైన కళత్రవియోగము, కొంతకాలానికి ఆచార్యదర్శనము జరిగాయి. ఆసంఘటనలన్నీ ఎంత విచిత్రంగా గడిచిపోయాయి!

ఆమె అతన్ని గాఢంగా ఆశ్లేషించుకొని హృదయంమీదనే మూర్ఛపోయింది. లోలోపల అతనికి ఆ ఆశ్లేషంలోనించి తప్పించుకొని బయటపడవలె నని అనిపించింది. ఒక్కసారిగా శాయశక్తులా ప్రయత్నించాడు. ఆమె పెన్నిధానం విడువలేని పేదలా మరింత గాఢంగా అతనిని కౌగలించుకొన్నది. గాలివాన మూలుగుతున్నట్లు భీషణంగా వీచింది. ఆకాశం నిరంతరంగా రోదిస్తున్నట్లుగా వర్షిస్తున్నది. సహజంగా అలసిన అతని శరీరానికీ, మనస్సుకూ, చైతన్యానికీ మగత కమ్మినట్లు నిద్ర పట్టింది. మళ్లీ భీకర

మైన ఝంఝామారుతం రయిమని వీచి, వారిరువురిపైనా పెద్ద జల్లులు కురిపించింది. ఆ గాలికి ఆగదిలోని చిత్రదీపికలన్నీ ఆరి పోయాయి. ఆ మహాంధకారంలో ధూమ్యాకాశాలు విలయనృత్యం చేస్తూ గర్జించాయి.

౪

రెండు రోజులనుండి తీవ్రంగా వీచిన గాలివాన మూడవనాటికి తగ్గుముఖం పట్టింది. కాని ఆకాశం అంతా మేఘాచ్ఛాదితంగానే ఉన్నది. గాలి బాగా తగ్గినా వర్షం కురుస్తూనే ఉన్నది. నేలమీద పడిన వృక్షశాఖలతోను, అక్కడక్కడ కూలిన గృహాల తోను వైశాలీనగరం అంతా పాడుపడినట్లున్నది. వీథులన్నీ జలమయమై, కప్పలకూతలు దారుణంగా వినవస్తున్నాయి. మూడవ నాటి ఉదయం అతని కొక దేవాలయఘంటానాదం వినబడింది. అప్పటినించీ ఇందుమాలిమనస్సులో పశ్చాత్తాపాగ్ని క్రమక్రమంగా రాజుకోవడం మొదలుపెట్టింది. తన పతనవృత్తాంతం తలుచుకుంటే, అతని కొక భయంకరస్వప్నంలా కనిపించింది. ఎక్కడి విదర్భదేశము! ఎక్కడి వైశాలీనగరం! ఎప్పటి వారుణీ ప్రణయగాథ! ఆ గాలివాన, ఆ దేవాలయంలో అఘాతం కేవలం తనకోసమే వచ్చాయా? ఈ మానసికశారీరక ప్రళయాలకు సంబంధమేమైనా ఉన్నదా? తాను మళ్లీ ఆశ్రమానికి పోగలడా? పోతే ఆచార్యులేమంటారు? ఆచార్యశిష్యులేమంటారు? వారికి వృత్తాంతం తెలియకపోవచ్చును! కాని తిరిగి తానే మొహం పెట్టుకుని ఆశ్రమంలో అడుగు పెట్టగలడు? తన కపటం అక్కడ అడుగుపెట్టే అర్హత ఉన్నదా? అతడిట్లాగే ఆలోచిస్తూ శయ్యపై శయనించి ఉన్నాడు. కన్నీళ్లు ధారాపాతంగా అతని చెక్కిళ్ళనుండి ప్రవహిస్తున్నవి. ఇంతలో వారుణి కాచదీపికతో అక్కడికి వచ్చింది. ఆమె ఎదుట అతన్ని చూచి నిర్ఘాంతపోయింది. ఆ దీపిక ఒకచోట ఉంచి తటాలున అతని శయ్యపైకి వచ్చి కూర్చున్నది. ఇంతవరకు ఇందుమాలికి సూర్యాస్తమానమైనసంగతే తెలియదు. మేఘచ్ఛన్నమైన ఆ దుర్దినంలో పగటికీ రాత్రికీ భేదం విలుప్తమై పోయింది!

ఆమె దగ్గరకు వచ్చేసరికి అతను యథాప్రకారంగా నవ్వుతూనే మాట్లాడాడు. ఆమెకు తన వేదనాకారణం తెలిసిఉండవచ్చును! కాని ఆమె అతని నావిషయంలో ప్రశ్నించలేదు! ఆమె ముఖంలోకూడా అతనికి తీవ్రమైన వేదనాచ్ఛాయలు కనిపించాయి. అయినా ఆమె కలకల నవ్వుతూనే మాట్లాడింది. ఆమె గడిచిన రెండురోజులకంటె ఎక్కువ మనోజ్ఞంగా అలంకరించుకొన్నది. చిత్రవిచిత్రమైన అలంకారాలతో కబరీభరం అంతా పూచిన తీగె వలె ఉన్నది. ఆమె తటాలున అతన్ని గాఢంగా ఆశ్లేషించుకొన్నది! శిలస్థంగా ఉన్న అతని హృదయాని కది మైమరచే మత్తు కలిగించింది. ఆమె ఈవేళ శరీరానుభూతి వంకటినీ కోవిళ్ళతో జాగ్రదుంటున్నది. ఆమెముఖంలో నేడు రెండురోజులనుండీ లేని తన్మయత, ఆనందము తాండవించాయి. ఆమె తృణాకృతానికి ఆనందసౌధపు మెట్లెక్కిపోతూన్నట్లు కనిపించింది. ఇందుమాలికి నేడామెమహోత్సాహము కొంత విచిత్రంగా కనిపించింది. ఆమె అతని కళ్లలోకి కొంతసేపు దీనంగా చూచి, "మీరు నన్నెప్పటికీ మరిచిపోకూడదు!" అన్నది. ఆపైన అతనిచేత చేతిలో చెయ్యివేయించుకొని నిశ్చింతగా అతని కౌగిలిలో నిద్రపోయింది.

అతని కీవేళ రెండురోజులనించీ పట్టినంత గాఢంగా నిద్ర పట్టలేదు. అతనికి కలలో తన్నెవరో వీపుమీద చరిచి లేపినట్లయింది. తటాలున లేచి చూచాడు. వారుణి గాఢంగా తనపక్కనే నిద్రిస్తున్నది. అతడు మళ్లీ నిద్రించాడు. గాలితోబాటు వాన కూడా క్రమక్రమంగా తగ్గిపోతున్నది. మారులనుండి ధారాపాతంగా

"అతడా పత్రాలు తీసుకొని ఆత్రంగా చదవడం మొదలుపెట్టాడు."

వర్షం కురవడం మానివేసి బిందువులు బిందువులుగా వర్షం కురుస్తున్నది. అప్పుడప్పుడు చెట్లమీద తల దాచుకొన్న పక్షులు తడిసిన రెక్కలు విదిలించుకొంటున్నాయి. ఆసమయంలో చెట్లఆకులపై నిలిచిపోయిన వర్షబిందువులన్నీ వర్షపుజల్లులాగ ధ్వని చేస్తూ నేలమీద పడుతున్నాయి.

ఇంతవారికి నిద్రలో తొందరతొందరగా తన్నెవరో పిలుస్తున్నట్లనిపించింది. తటాలున కళ్లు నలుపుకుంటూ శయ్యమీద కూర్చున్నాడు. సమీపంగా "కొక్కొరోకో" అని కోడి కూసింది. ఇంకా బాగా తెల్లవారలేదు. అయితే కారుచీకటి తగ్గింది. వర్షం కూడా బాగా తగ్గింది. ఆకాశం అంతా నిర్మలంగా ఉన్నది. పైపైన సప్తఋషుల నక్షత్రాలు మెరుస్తున్నాయి. దూరంగా ధ్రువతార మినుకుమినుకుమంటూన్నది. తరువాత అతని దృష్టి వాసంతివైపు తిరిగింది. కాని ఆమె అక్కడ లేదు. ఎక్కడకు వెళ్లింది? దూరంగా ఒకమూల ఉన్న దీపం శయ్యకు దగ్గరగా పెట్టి పోయింది. ఆదీపికకు సమీపంలో భూర్జపత్రాలపై వాసంతిహస్తాక్షరాలు కనిపించాయి. అతడు ఆపత్రాలు తీసుకుని ఆత్రంగా చదవడం మొదలుపెట్టాడు. అది ఆమె తన్నుద్దేశించి వ్రాసిన లేఖ. అతడు మొదటిభాగం అంతా గబగబా చదివాడు. ఆలేఖాంశం పూర్తికాలేదు. అతడింకా తొందరగా చదవడం ప్రారంభించాడు: "మీరు నిర్దాక్షిణ్యంగా నన్ను, విదర్భదేశాన్ని విడిచి వెళ్లిపోయారు. ఒక్క మాటైనా చెప్పకుండా నన్నావిధంగా విడిచివెళ్లడం మీకు న్యాయంగా ఉన్నదా? నేను మీకోసం ఎంత తపించిపోయాను! నాకు అంతవరకు మీ పత్నీవియోగవార్త తెలియనేలేదు. తరవాత ఒక ఆరుమాసాలకు మీరు జగదీశ్వరాలయంలో ఆశ్రమంలో ప్రవేశించినట్లు తెలిసింది. నేను విదర్భదేశం విడిచి నాసంసారంతోసహా వైశాలీనగరానికి వచ్చివేసి, ఈ ప్రాసాదంలో నివసించడం మొదలుపెట్టాను. కొన్నాళ్లకు మీ మూర్తి నాకు ప్రత్యక్షమైంది. అప్పటినించీ ఆ మధ్యాహ్నభిక్షవేళ మీపై ఒకసారి తిలకించడమే నాకు నేత్రామృతంగా ఉండేది. కాని నాకు మిమ్మల్ని ఒక్కసారి నోరారా పలకరించడానికి కూడా సాహసం కలగలేదు.

"ఎన్నో రాత్రులు మీచిత్రాన్ని మనస్సులో నిలిపి జాగరాలు చేశాను. నేను ఎన్నడూ కలలోకూడా మీ వ్రతభంగం చెయ్య దలచుకోలేదు! ఆ గాలివానలో మీ రావిధంగా చిక్కుకొని ఉండడం నేను మేడమీదనించి గమనించాను. కాని మిమ్మల్ని మా భవనానికి ఆహ్వానించడానికి కూడా నాకు సాహసం కలగలేదు. ఇక ఆదేవాలయంలో మీరు అఘాతం తగిలి పడిపోయినప్పుడు మాత్రం మా పరిచారకుల నక్కడికి పంపించాను. మీరు స్పృహలేకుండా ఉండడంచేత మా భవనంలో ఉంచి నేనే దగ్గరుండి పరిచర్య చేశాను. ఆ గాలివాన, ఆ సంఘటన అది అంతా కేవలం దైవికమని నమ్మండి!

కాని, ఒక్క మాటమాత్రం నిశ్చయము. నేను మిమ్మల్ని విడిచి జీవించలేకపోయాను. మీరు లేని బ్రతుకే వ్యర్థమని అనిపించింది. అనేకసారులు ఆత్మహత్యాప్రయత్నంకూడా చేశాను. ఒక్కసారి మీ కౌగిలింతలో క్షణమాత్రం విశ్రమించి, ఆపిమ్మట మరణించవలెనని అనిపించింది. నాహృదయరహస్యం ఎరిగిన మీ కిది అంతా చర్వితచర్వణం కాగలదని అనుకుంటున్నాను. మొదటినాటి రాత్రి మీస్పర్శలోనే నాకు మైమరపు కలిగింది. ఆరెండవనాటి రాత్రిలో జీవితపరమావధికమైన దివ్యానందం అనుభవించాను. ఆ ఆనందానుభూతిని నేను మీ కేవిధంగా వ్యక్తం చెయ్యగలను? నా కానాడు జీవితపు ఆనందావధులు అందుకొన్నట్లు తోచింది. నా జన్మ తరించినట్లు కనబడినది. ఆ రెండవనాటి రాత్రి మీరుకూడా ఆనందతన్మయతలో లీనులైపోయినారు. అది ఎంత గొప్పరాత్రి! నా కానాడు మరి కన్నులు తెరవాలని బుద్ధి పుట్టలేదు! ఆ శుభస్వప్నంలో అల్లాగే మరణించాలని అనిపించింది. నా కా ఆనందం స్థిరంగా నిలదని తెలుసును! ఆ మరునాడు నేను మీముఖంలో పశ్చాత్తాపం గమనించాను. నా ఆనందం ఎంత గభీరమైనదో మీ పశ్చాత్తాపం కూడా అంత గభీరమైనదని నా కాక్షణంలో స్ఫురించినది. అయితే జరిగినదంతా ఆవాలోచితంగాను, దైవికంగాను జరిగినదనే తృప్తి నాకున్నది! ఒక్కరాత్రిలో ఆనందావధికూడా అందుకున్నాను! మరునా డుదయం లేచేసరికి ఆ మైకం నాకన్నులలో పొంగులువారుతూనే ఉన్నది. అంత అవధి అందుకొన్న తరవాత నాకు భవిష్యజ్జీవితం అంతా నిస్సారంగా కనిపించింది. నా కా ఆనందపు మైకంలోనే మరణించవలెనని కోరిక కలిగింది. విషపాత్ర తాగిన తరవాతనే నేనీలేఖ ప్రారంభించాను! మీరీలేఖ చూచేసరికే నేను మృతినిద్రలో తన్మయురాలనై ఉంటాను! సెలవు—చరణదాసి, వాసంతి."

జరిగినదంతా క్షణంలో అతని హృదయంలో అవగతమైంది. తటాలున శయ్యమీదనించి కిందికి ఉరికి అతడు నలువైపులా కలయజూచాడు! శయ్యకు తలగడవైపున వాసంతి నేలపై పడి ఉన్నది. తటాలున అత డామెనాడి పరిశీలించాడు. అనుకున్నంతపనీ జరిగిపోయింది! స్తబ్ధహృదయంతో అతడలాగే నిలబడిపోయాడు! అతని కళ్లకెదురుగా గవాక్షంలో కలకలలాడుతూన్న అరుణోదయము, నిర్మలాకాశము కనిపించాయి. పక్షుల కిలకిలారావాలతో జగత్తంతటా ఉషోనృత్యం ప్రతిధ్వనించింది. ఆ తీవ్రహృదయాఘాతంలోను, ఆపక్షుల కలకలారావాలలోను, ద్విధావిభిన్నమైన బాహ్యప్రపంచంవైపు చూస్తూ అతడు అలాగే నిలబడిపోయాడు! "ఎప్పటికైనా ఆ నగరమధ్యంలోనే, ఆ జీవితకోలాహలంలోనే నీ తత్త్వాన్వేషణ ఫలిస్తుంది. ఇది ముమ్మాటికీ నిశ్చయము." అని ఆచార్యు డన్న మాటలు అతని హృదయంలో గభీరంగా మారుమోగాయి.

అతడు మళ్లతిరుగుతూ ఊరకలు వేసుకుంటూ పరుగెత్తిపోయే ఆ జీవిత ప్రవాహంవైపు చూచాడు! చటాలున ఆతనికి ఆచార్యుని మాటల లోని అంతరార్థం స్ఫురించింది! జీవితచాంచల్యము, అచాంచల్యంలో అంతర్లీనమైన జీవితసత్యము, ఆనందము ఆతనిలో ఒక్క సారిగా ప్రజ్వలించాయి! మళ్లీ కొయ్యదగ్గర చిరునవ్వులతో మరణించి పడిఉన్న వారుణిముఖంపై పాకపారి పరికించాడు. బాష్పార్ద్రనయనాలతో మెల్లిగా మళ్లీ ఆశ్రమంవైపు నడిచివెళ్లి పోయాడు!



పండితరాయుల సూర్యోపాసన

ఈ మహాకవి యవనకన్యయైన లవంగిని చేపట్టి వర్ణభ్రష్టుడయ్యెనుగాని మతభ్రష్టుడు కాలేదు. ఇతడు శుద్ధాద్వైతుడు. అందును లక్ష్మీనారాయణభక్తుడు. భక్తియోగనిష్ఠుడు. ఇందు కితని లహరీవచనములే ప్రమాణము.

"పరే నిత్యం మాతర్గుణమయి పరబ్రహ్మమహితే,
జగన్నాథస్యాకర్ణయ మృదులః శ్లోకి విహారాన్"
"ఆధివ్యాధిజరాపరాహతి! యది క్షేమం నిజం వాంఛసి!
శ్రీకృష్ణేతి రసాయనం రసయ రే శూన్యైః కిమన్యైః శ్రమైః!"
"సంజ్ఞాకాంతసుతే కృతాంతభగిని శ్రీకృష్ణనిత్యప్రియే!
పాపోన్మూలిని పుణ్యధాత్రి యమునే కాళింది తుభ్యం నమః"

పండితరాజు వైదికకర్మవిహీనుడు కాడుగాని, వైదికతత్త్వమును వేదాంతరహస్యముల నెఱిగిన మీమాంసాతత్త్వవేత్త. ఆ విజ్ఞాన మితని స్తుతికావ్యము లన్నిట ప్రతిఫలించుచునే యున్నది. అం దితని సుధాలహరినిబట్టి యితని సౌరవిజ్ఞాన మించుక తెలిసికొందము.

ఋగ్వేదములో నగ్నీంద్రసూక్తములతరువాత గణింపదగినవి సూర్యసూక్తములు. మఱియు సౌర మహాత్మ్యము నెక్కువగా వర్ణించినది తైత్తిరీయారణ్యకము. అందలి విజ్ఞానమును సంగ్రహముగా సూచించిన దితని సుధాలహరి. ఇది చూచుటకు ముప్పది శ్లోకముల చిన్నకావ్యమేకాని, గుణమున నిది గొప్ప కావ్యమే. మయూరకవ్యాదుల సూర్యస్తవములు దేశమున వ్యాపించియున్నవి. వానితో బోల్చి చదివినవారి కిందలి విశేషము గోచరింపకపోదు. మఱియు, వివిధాలంకారభూషిత, మపూర్వభావోపేతము నైన యీ చిన్న కావ్యము శబ్దార్థముల శ్రవణానందము హృదయానందము నగుచున్నదనుట చెప్పదగిన విశేషాంశము.